మలి విడత దీపం బుకింగుకు

నేడే ఆఖరు



చిత్తూరు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వంటింటి ఖర్చు తగ్గించే లక్ష్యంతో ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక గత ఏడాది నవంబరులో దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. తొలివిడత కావడంతో అనేక అవరోధాలు, సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఐదు నెలలు సిలిండర్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. అర్హులైన వారి ఖాతాల్లో నగదు జమచేశారు. రెండో విడత పంపిణీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. ఇది ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ విడత రాయితీ నగదు పొందాలంటే ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా గ్యాస్ బుక్‌చేసుకోవాలి. ముందుగా నగదు చెల్లించాలి. తర్వాత 48 గంటల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది. ఆగస్టు 1 నుంచి మూడో విడత రాయితీ, సిలిండర్ వర్తింపు ప్రారంభమౌతుంది.

రాయితీ నగదు జమకాకపోతే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సమస్య తెలియజేయవచ్చు. అంతకుముందు గ్యాస్ ఏజెన్సీని ఈ విషయమై సంప్రదించాలి. అక్కడ ఈకేవైసీ చేయించుకోవాలి. తర్వాత బ్యాంకును సంప్రదిస్తే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్‌తో అనుసంధాన ప్రక్రియ చేపడతారు. రాయితీకి అర్హత ఉంటే ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

తొలి సిలిండర్ అందుకున్నవారు	: 3.34 లక్షలు
మంజూరైన రాయితీ నగదు	: రూ.27.72 కోట్లు
రెండో సిలిండర్ అందుకున్నవారు	: 3.31 లక్షలు
మంజూరైన రాయితీ నగదు	: రూ. 22.50 కోట్లు

నెలాఖరుతో గడువు ముగింపు

దీపం-2 రెండో విడత గ్యాస్ బుకింగ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. అర్హులైన మరో మూడువేల మంది లబ్ధిదారులు త్వరపడి బుకింగ్ చేసుకోవాలి. రాయితీ నగదును సత్వరం జమచేస్తాం.

శంకరన్, డీఎస్వో, చిత్తూరు

4517 మందికి భాగస్వామి పింఛన్లు

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇంటిపెద్ద దిక్కు కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతువులకు భాగస్వామి (స్పౌజ్) పింఛన్లు ఆగస్టు నుంచి పంపిణీ చేయడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 2023 డిసెంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 మధ్య సామాజిక భద్రత పింఛను తీసుకుంటూ మృతి చెందిన వారి పింఛను వారి జీవిత భాగస్వామికి బదలాయించేందుకు ఏప్రిల్ 24న చర్యలు ప్రారంభించారు.మరణించిన వారి వివరాలు, ధ్రువపత్రంతో పాటు జీవిత భాగస్వామి వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించి ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. వీరితో పాటు 2024 నవంబరు నుంచి మృతి చెందిన వారి భాగస్వామికి కూడా పింఛనుకు అవకాశం కల్పించింది. దీంతో అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకుని పింఛను కోసం ఎదురుచూస్తున్నారు.వీరందరికీ ఆగస్టులో భాగస్వామి పింఛన్లు అందుతాయని ప్రభుత్వం చెప్పడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 31 మండలాల్లో 4517 మందిని భాగస్వామి పింఛన్లకు అర్హులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. దరఖాస్తులు సైతం స్వీకరించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ భరోసా పథకంలో స్పౌజ్ పింఛను విధానాన్ని ప్రవేశపెట్టింది.



సామాజిక పింఛను తీసుకునే భర్త మృతి చెందితే భార్యకు, ఆ మరుసటి నెల నుంచే పింఛను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారులందరికీ రూ.4 వేల చొప్పున ఇంటికి వెళ్లి పింఛన్ అందించనున్నారు.

శ్రీవారి డాలర్ల కేసులో 15 మందిపై చర్యల నిలిపివేత

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి డాలర్ల విక్రయ కౌంటర్‌లో అక్రమాలు జరిగాయంటూ 19 ఏళ్ల కిందట సంచలనం సృష్టించిన కేసులోని ఆరోపణల నుంచి 15 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు విముక్తి పొందారు. మొత్తం 20 మందిపై ఆరోపణలు రాగా క్రిమినల్, శాఖాపరమైన విచారణల అనంతరం వీరిలో 15 మందిపై చర్యలు నిలిపివేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురు పదవీ విరమణ చేయగా, కొందరు మరణించారు కూడా. తిరుమల శ్రీవారి డాలర్ల విక్రయాల కౌంటర్‌లో 5 గ్రాముల బరువుండే 300 శ్రీవారి డాలర్లు అదృశ్యమయ్యాయని 2006లో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం గుర్తించింది. వాటి విలువను రూ.15.40 లక్షలుగా అంచనా వేసింది. ఈ మేరకు విచారణ జరిపి 20 మంది బాధ్యులంటూ టీటీడీకి నివేదిక అందించింది. అప్పట్లో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించగా, వాళ్లూ దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారు. విజిలెన్స్, సీబీసీఐడీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం సంబంధిత ఉద్యోగులు, అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ.. ఆ బాధ్యతను కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించింది. తొలుత కేసును అప్పటి కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సుబ్రేంద్రు భట్టాచార్యకు, తర్వాత మరో సభ్యుడు, రిటైర్డు ఐపీఎస్ అధికారి జె.సత్యనారాయణకు అప్పగించారు. గతేడాది జనవరిలో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. విచారణలో 15 మంది ఉద్యోగులు, అధికారులపై ఆరోపణలు రుజువు కాలేదని నివేదికలో పేర్కొంది. వీరిపై చర్యలు నిలిపివేయాలని టీటీడీ ఈవో ప్రభుత్వాన్ని కోరగా.. ఆ మేరకు రెవెన్యూ శాఖ ఎఫ్ఏసీ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ 15 మంది వీరే

తిరుమల పేష్కార్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.రఘురామిరెడ్డి, ఇ.రామచంద్రారెడ్డి, ఏవీ రమణమూర్తి, డీఈవో ఆర్.రంగనాథాచారి, ఇన్‌స్పెక్షన్ విభాగం ఏఈవో కె.చిత్తరంజన్, సీనియర్ అసిస్టెంట్, ఎస్వీ ఆయుర్వేదిక్ ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్లు బి.మురళీకృష్ణమూర్తిరాజు, రావినూతల శ్రీరామ్, సూపరింటెండెంట్లు ఎం.వెంగన్న, కె.గోవర్ధన్, డిప్యూటీ ఈవో ఎస్.చెంచులక్ష్మి, సీనియర్ అసిస్టెంట్, బొక్కసం క్లర్క్ బీఆర్ గురురాజారావు, రిసెప్షన్ విభాగం డిప్యూటీ ఈవో ఆర్.ఉమాపతి, వైకుంఠం క్యూ కాంప్లెక్సు ఏఈవో, ఇన్‌స్పెక్షన్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.గజపతి. వీరిలో గురురాజారావు, రావినూతల శ్రీరామ్ సర్వీసులో ఉన్నారు. మురళీకృష్ణమూర్తి రాజు, ఎం.వెంగన్న, ఏవీ రమణమూర్తి రిటైరై మరణించారు.

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జూలై నెల సాధారణ వర్షపాతం 101.8 మిమీ కాగా, ఈనెల 25వ తేదీవరకు 95.8 మిమీ వర్షం కురిసింది. సూర్య ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చిత్తూరు నగరంలో బుధవారం 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గురు, శుక్ర, శనివారాల్లో 36 డిగ్రీలకు పెరుగుతాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. చాలాచోట్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడిగాలులు వీస్తున్నాయి. చిన్నచిన్న పనులు చేసుకునే శ్రామికులు ఎండవేడిమికి అల్లాడిపోతున్నారు. రానున్న ఐదురోజుల్లో జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, ఆగస్టు 3 తర్వాత చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

40 మంది ఏఈల జీతాల నుంచి రూ.30 లక్షల రికవరీ

● నోటీసులు జారీ చేసిన ఏపీఈఆర్సీ

చిత్తూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేసిన 40 మంది ఏఈలపై క్రమశిక్షణ చర్యలకు ఏపీఈఆర్సీ సిద్ధమైంది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు జిల్లావ్యాప్తంగా సుమారు 1050 మంది విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.పరిష్కార విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫిర్యాదు చేశారు. దీనిపై సీరియస్ అయిన ఏపీఈఆర్సీ 40 మంది ఏఈలకు నోటీసులు జారీ చేసింది. ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని భావించిన ఏపీఈఆర్సీ పరిహారం కింద రూ.30.36 లక్షలు ఏఈల జీతాల నుంచి రికవరీ చేసి 1050 మంది వినియోగదారుల ఖాతాల్లో జమచేయనుంది. చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో రూ.4.62 లక్షలు, అర్బన్ డివిజన్ పరిధిలో రూ.9.08 లక్షలు, పుంగనూరు పరిధిలో రూ.16.65 లక్షలు రికవరీ చేయనున్నారు.

ఇద్దరు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు సీఐగా ఉన్న ఎం.సూర్యనారాయణను స్పెషల్ బ్రాంచీకి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీఐ జయరామయ్యను కల్లూరు సీఐగా బదిలీ చేశారు.

పల్లె... స్వచ్ఛమల్లె

ఐవీఆర్ఎస్ ద్వారా 166 పంచాయతీల్లో అభిప్రాయ సేకరణ



బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెలో చెత్త సేకరణ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగు .... స్వచ్ఛతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. 'మీ గ్రామంలో వీధులు శుభ్రంగా ఉన్నాయా? రోజూ మీ ఇంటికి చెత్త సేకరణ బండి వస్తుందా? ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం పనిచేస్తోందా? మీ ఊర్లో మురుగుకాల్వల పరిస్థితి ఏమిటి?' అంటూ పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఎంపికచేసిన గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఫోన్లు వస్తున్నాయి. పల్లెల్లో పారిశుధ్యం, రక్షిత తాగునీటి సరఫరాపై ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఆ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రజాభిప్రాయాన్ని విశ్లేషించి, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.తొలి విడతలో 150 గ్రామాలను, రెండో విడతలో 200 గ్రామాలను, మూడో విడతలో 270 గ్రామ పంచాయతీలను సర్వే కోసం ప్రభుత్వం ఎంపిక చేసింది.

జిల్లాలో మండలాలు	31
గ్రామ పంచాయతీలు	697
సచివాలయాలు	612

ప్రజల సంతృప్తి శాతం ఇలా...

జూలై	: 59
జూన్‌లో	: 57
మే	: 43

● **ఉత్తమంగా మూడు పంచాయతీలు**

ఐవీఆర్ఎస్ సర్వేకు 166 గ్రామపంచాయతీలను ఎంపికచేశారు. ఈ ఏడాది మార్చి 7వ తేది నుంచి ప్రక్రియ ప్రారంభించగా, ప్రజల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ఉత్తమ పంచాయతీలుగా ఐరాల మండలంలోని కాణిపాకం , విజయపురం మండలంలోని జగన్నాథపురం , పాలసముద్రం మండలంలోని శ్రీకావేరి రాజపురం పంచాయతీలు నిలిచాయి. వంద మంది ఇక్కడి సర్వేలో భాగస్వాములు కాగా, కాణిపాకంలో 95 శాతం, శ్రీకావేరిరాజుపురంలో 90 శాతం, జగన్నాథపురంలో 89శాతం మంది చెత్త సేకరణ బాగుందని, రక్షిత తాగునీటి సరఫరా జరుగుతోందని వందశాతం మంది చెప్పారు. నగరి మండలంలోని బుగ్గ అగ్రహారం, శ్రీరంగరాజపురం మండలంలోని శ్రీరంగరాజపురం పంచాయతీల్లో 80 శాతం బాగుందని చెప్పగా, గుడిపాల మండలం కొత్తపల్లి పంచాయతీలో 83శాతం బాగుందని చెప్పారు. కాగా కార్వేటినగరం మండలం కత్తెరపల్లి పంచాయతీలో 14 శాతం, అమ్మపల్లిలో 24 శాతం, సదుం మండలం చెరకువారిపల్లె పంచాయతీలో 25 శాతం, పులిచెర్ల మండలం దేవళంపేటలో 25 శాతం, పుంగనూరు మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీలో 25 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల్లో 40 నుంచి 60శాతం మంది చెత్తసేకరణ, నీటి సరఫరా జరుగుతోందని మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

అందుబాటులో టోల్‌ఫ్రీ నెంబరు



గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కార్యాలయంలో 1800 425 0017 టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేశాం. సర్వేలో వెల్లడైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులు చేసేలా కసరత్తు చేస్తున్నాం. ఇక్కడ గ్రీన్ అంబాసిడర్ల నియామకం, ట్రైసైకిళ్లతో చెత్తసేకరణ పెంచేందుకు చర్యలు చేపడతాం. ఆగస్టు నెలలో సంతృప్తి శాతాన్ని 80కి పెంచుతాం.

\- సుధాకర రావు, జిల్లా పంచాయతీ అధికారి

నలుగురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు

● విచారణ అధికారిగా జేసీని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇదివరకు నగరి తహసీల్దార్‌గా పనిచేసిన కె.వెంకటరమణతో పాటు మరో ముగ్గురు అధికారులపై క్రమశిక్షణా చర్యలను ప్రభుత్వం ప్రారంభించింది. ఏపీసీఎస్ 1991లోని రూల్ (20) కింద వారిపై చార్జి ఆర్టికల్ జారీచేయబడింది. ఇందుకు సంబంధించి విచారణ అధికారిణిగా జేసీ విద్యాధరిని బుధవారం నియమిస్తూ నెల రోజుల్లోగా నివేదిక పంపాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఆదేశించారు.గతంలో నగరి తహసీల్దార్లుగా పనిచేసిన కె.వెంకటరమణ, కె.బాబు, కె.సదాశివ పిళ్లై (రిటైర్డ్ గ్రామ రెవెన్యూ అధికారి), గతంలో నగరి మండలంలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన బి.దేవదాసులపై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు ప్రారంభించింది. నగరి మండలంలోని సర్వే నెం. 4/2, 4/4, 109/1, 109/3లోని ప్రభుత్వ భూముల్లో ఆర్.సిద్ధయ్య నాయుడు అనే వ్యక్తి దురాక్రమణ చేసినట్లు తెలిసినా, ఉద్దేశపూర్వకంగా ఆ ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోలేదనే ఆరోపణపై లోకాయుక్త సంస్థకు తప్పుడు నివేదికలు సమర్పించినందుకు వారిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. విచారణ అధికారిగా జేసీ విద్యాధరిని నియమించింది. దీనిపై క్రమశిక్షణా అధికారి తరపున కేసును సమర్పించేందుకు నగరి రెవెన్యూ డివిజనల్ అధికారిని ప్రిసెంటింగ్ అధికారిగా నియమించింది. ఈయన ఈ కేసుకు సంబంధించిన రికార్డులను, పత్రాలను కలెక్టరేట్ నుంచి పొంది విచారణ అధికారిగా నియమించిన జేసీ ఎదుట సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.



సైకిల్‌పై శాంతి యాత్ర

● 60ఏళ్ల వృద్ధుడి సాహసం

వందల కిలోమీటర్లు తిరిగి పాతపడ్డ సైకిల్! దాని ముందూ, వెనుక లగేజీ బ్యాగులు! సైకిల్ చుట్టూ హిందీ, ఇంగ్లీషు భాషలో రాసిన బోర్డులు! ఓ 60 ఏళ్ల వృద్ధుడు గిరిగిరామంటూ తిరుపతిలో ఆ సైకిల్ తొక్కుతూ జోరుగా వెళుతున్నారు. అతడిని ఆపి పలకరిస్తే ఆసక్తికర విషయాలు చెప్పారు.



కర్నాటక రాష్ట్రం హసన్ జిల్లాకు చెందిన నాగరాజ్ గౌడ్ సైకిల్ యాత్ర ద్వారా దేశం చుడుతున్నారు. పదో తరగతి మాత్రమే చదివిన ఆయన కన్నడ, హిందీ, తెలుగు, తమిళ్, హిందీ, ఇంగ్లీషు భాషలు అనర్గళంగా మాట్లాడుతున్నారు. కన్నడలో జూనియర్ ఆర్టిస్టుగా అనేక సినిమాల్లో నటించారు. పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గా ఉండిపోయారు. భవబంధాలకు దూరమై ఏక్‌నిరంజన్‌గా మారినతర్వాత విశ్వశాంతికోసం సైకిల్ యాత్ర చేయాలనుకున్నాడు. 'ప్రపంచ శాంతి, సహజ వనరుల పరిరక్షణ, మనుషులంతా ఒక్కటే, సమైక్యతపై ప్రజలలో అవగాహన పెంచేందుకు భారతదేశ యాత్ర చేస్తున్నా. 2017 డిసెంబరులో ముంబై నుంచి యాత్ర మొదలుపెట్టా. కరోనా సమయంలో రెండేళ్లు నిలిపివేశా. మళ్లీ మొదలుపెట్టా. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హరియాణా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, జార్ఖండ్, వెస్ట్‌బెంగాల్, తెలంగాణ మీదుగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యాత్ర కొనసాగుతోంది. రోజుకు 60 నుంచి 80 కి.మీ ప్రయాణం చేస్తా. ఆలయాలు, ఆశ్రమాల వద్ద రాత్రి బస చేస్తా. దారిన కనిపించే దాతలు ఇచ్చే ఆర్థికసాయంతో దారి ఖర్చులు పెట్టుకుంటా. యాత్రలో భాగంగా ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిశా. మరో రెండేళ్లలో దేశవ్యాప్త యాత్ర ముగుస్తుందని అనుకుంటున్నా' అని అన్నారు నాగరాజ్ గౌడ్.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.89 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,183

తలనీలాలు సమర్పించినవారు: 25,906



అమ్మో.. గజరాజులు

● భయం గుప్పెట్లో సత్యసాయి ఎస్టీ కాలనీ వాసులు ● మామిడి చెట్ల ధ్వంసం

చంద్రగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురం పంచాయతీ సత్యసాయి ఎస్టీ కాలనీ ప్రాంతంలో మళ్లీ ఏనుగులు సంచరించాయి. రెండు రోజులుగా ఏనుగులు సంచరిస్తుండటంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి 11 ఏనుగుల గుంపు శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. మళ్లీ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఏనుగుల గుంపు సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలోని మేడసాని ఆనందనాయుడు మామిడి తోటలోకి వచ్చాయి. ఐదు మామిడి చెట్లను విరిచేశాయి. పక్కనే ఉన్న చెంచయ్య వరిపైరునూ తొక్కి నాశనం చేశాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు తమ సిబ్బందితో వెళ్లి డ్రోన్ సాయంతో ఏనుగుల గుంపును గుర్తించి కాలనీలలో రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా పేల్చారు. బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఏనుగులు మళ్లీ శేషాచలం అడవుల్లోకి వెళ్లిపోవడంతో అటవీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంత సమీపంలో సంచరిస్తుండటంతో ఇప్పటికే నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు మండలంలోని శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచిస్తున్నారు. ఈ ప్రాంతాల ప్రజలు, అటవీ సిబ్బంది సంయుక్తంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఏదైనా ఏనుగుల సంచారం, కదలికలు, ఉంటే తమకు వెంటనే సమాచారం అందించాలని అధికారులు కోరారు.



సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలో వచ్చిన ఏనుగులు



లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, అమరనాథరడ్డి, గురజాల జగన్మోహన్ తదితరులు



నానీని పలకరిస్తున్న చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

పులివర్తి లక్ష్మీభారతికి ప్రముఖుల నివాళి

పాకాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి, పులివర్తి లక్ష్మీభారతికి పలువురు ప్రముఖులు, అధికారులు నివాళులు అర్పించారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో బుధవారం జరిగిన లక్ష్మీభారతి కర్మక్రియలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, గురుజాల జగన్మోహన్, డాక్టర్ కలికిరి మురళీమోహన్, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, భాష్యం ప్రవీణ్, శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డీసీసీబీ అధ్యక్షుడు అమాస రాజశేఖర్ రెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, ఏఎస్పీ రవి మనోహరాచారి, టీడీపీ నాయకులు దొరబాబు, సీఆర్ రాజన్, చంద్రప్రకాష్‌నాయుడు, వలపల దశరథనాయుడు, చంద్రగిరి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై లక్ష్మీభారతికి నివాళులు అర్పించారు.

'జూనియర్' మొక్కు చెల్లించుకున్నా

● తిరుమలలో హీరో గాలి కిరీటిరెడ్డి



గాలి జనార్దన్ రెడ్డి, కిరీటి రెడ్డి

తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'జూనియర్ సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుని ఆశీర్వదించమని మొక్కుకున్నా. ప్రేక్షకులు సినిమాను ఆదరించారు. మొక్కు చెల్లించుకోవడానికి మళ్లీ వచ్చా' అని హీరో గాలి కిరీటిరెడ్డి తెలిపారు. తన తండ్రి, పారిశ్రామికవేత్త గాలి జనార్దన్‌రెడ్డి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రెండువారాల్లో తన తర్వాతి సినిమాను ప్రకటిస్తామన్నారు. ప్రముఖ హీరోలు పునీత్ రాజ్‌కుమార్, జూనియర్ ఎన్టీఆర్ తనకు ఎంతో స్ఫూర్తినిచ్చారని చెప్పారు. తన కుమారుడు కిరీటి చిన్నప్పటి నుంచే కళాకారుడని గాలి జనార్దన్‌రెడ్డి తెలిపారు.

మహిళల ఉచిత ప్రయాణం
అమలుకు సిద్ధంగా ఉన్నాం



పూల నాగరాజు - దిల్‌రాజు, అశోక్ - అశ్విని

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ రాయలసీమ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్షించారన్నారు. మహిళలు గౌరవంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేలా సీఎం అనేక సూచనలు చేశారన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలోని మరుగుదొడ్లు, తాగునీటి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అలాగే, సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు అశోక్, సీఎం ప్రోగ్రాం అడ్వైజర్ పి.వెంకటేష్, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, కన్నడ సినీనటుడు పునీత్‌రాజ్‌కుమార్ సతీమణి అశ్విని ఉన్నారు.

హేళనగా చూస్తున్నారు..!

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ల ఎదుట విలపించిన విద్యార్థినులు



వసతి గృహంలో విద్యార్థినులను విచారిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పూడిమిట్ల కుమారి

కోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటనపై సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు హేళనగా చూస్తున్నారు.. సహచర విద్యార్థినులతో కలసిపోదామంటే అంగీకరించడం లేదు.. పాఠశాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ల ఎదుట విలపించారు. కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ వసతిగృహం విద్యార్థినులను యూనిఫాం వేసుకొని రాలేదన్న కారణంగా బెత్తంతో కొట్టి గుంజిళ్లు తీయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారించిన డీఈవో కేవీఎన్ కుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌ను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు పూరిమిట్ల కుమారి, యుగంధర్ పొన్న కోటలోని వసతిగృహంలో విచారణ చేపట్టారు. అలాగే తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, అసెంబ్లీ కమిటీ సభ్యురాలు పోలమ్మ, పార్లమెంట్ కార్యదర్శి భారతి, మాజీ జడ్పీటీసీ ప్రమీల, టౌన్ ప్రెసిడెంట్ గుండాల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ కల్పన వసతిగృహంలో విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ యూనిఫాం వేసుకురాలేదని వ్యాయామ ఉపాధ్యాయుడు తమను దుర్భాషలాడుతూ కొట్టిన సంగతి వాస్తవమే అన్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత పాఠశాలలో ఎవరూ తమతో మాట్లాడటం లేదని కంటతడి పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలకు వెళ్లాలంటే భయంగా ఉందని వాపోయారు.కాగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సమక్షంలో శుక్రవారం మళ్లీ విచారణ చేపడుతామని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు తెలిపారు. పూర్తి వివరాలను సీడీ, నివేదిక రూపంలో విద్యాశాఖమంత్రి లోకేశ్‌కు పంపుతామని చెప్పారు.



మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ వీరభద్రస్వామి

పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై అవగాహన

సత్యవేడు, జూలై 30: (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్ (ఏపీ) వీరభద్రస్వామి ఆధ్వర్యంలో బుధవారం పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై అవగాహన సదస్సు జరిగింది. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ ప్రోగ్రాంగా పిలిచే పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో ఆమోదించింది. దీనిపై అవగాహన పెంచి పథకం సమర్థవంతంగా అమలయ్యేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని పీఎఫ్ కమిషనర్ తెలిపారు. తయారీ రంగంలో భారీగా ఉద్యోగాల సృష్టి, పరిశ్రమల యాజమాన్యాలు కొత్త ఉద్యోగులకు అందించే ఆర్థిక ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లు రవితేజరెడ్డి(కడప), సతీష్‌కుమార్ (తిరుపతి), శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్)రమేష్ కుమార్, హెచ్ఆర్ ప్రతినిధి శివకుమార్, ఈపీఎఫ్‌వో ఉన్నతాధికారులు, వివిధ పరిశ్రమల హెచ్ఆర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నరసాపూర్- బెంగళూరు ప్రత్యేక రైలు దారిమళ్లింపు

● అరక్కోణం జంక్షన్ వద్ద ఇంటర్ లాకింగ్ పనులతో తిరుపతి మీదుగా రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), జూలై 30 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్- బెంగళూరు ప్రత్యేక రైళ్లు (07153- 07154) ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబరు 27వ తేది వరకు తిరుపతిమీదుగా నడవనున్నాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. 'ఈ ప్రత్యేక రైళ్ళు రేణిగుంట, తిరుత్తణి, మేల్‌పాకం, కాట్పాడి మీదుగా రాక పోకలు సాగించేవి. అరక్కోణం రైల్వే జంక్షన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న కారణంగా దారి మళ్లించారు. తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా బెంగళూరుకు రాక పోకలు సాగిస్తాయి. నరసాపూర్‌లో బయలుదేరి తిరుపతికి తెల్లవారుజామున 3.38 గంటలకు చేరుకొని.. 3.43 గంటలకు తిరిగి బెంగళూరుకు బయలుదేరుతుంది. బెంగళూరు నుంచి వచ్చేటప్పుడు తిరుపతికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకొని 5.35 గంటలకు బయలుదేరుతుంది' అని ప్రకటనలో పేర్కొన్నారు.

నవోదయ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 6వతరగతిలో ప్రవేశానికి డిసెంబరు 13న జరిగే ఎంపిక పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గీత తెలిపారు. ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడవు పొడించినట్లు ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో విద్యార్థులు నివాసం ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 89199 56395, 70132 01138 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పద్మావతి పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు



ఉత్తర్వులతో టీటీడీ ఈవో శ్యామలరావు, ప్రిన్సిపాల్ పద్మావతమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌కి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. గత నెలలో ఎన్‌బీఏ బృందం ఈ కాలేజీలో పర్యటించింది. విద్యార్థులు, ఉద్యోగులు, లైబ్రరీ, ల్యాబ్ తదితర సదుపాయాలు, ప్రమాణాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, అధ్యాపకులను టీటీడీ ఈవో శ్యామలరావు అభినందించారు. ఈ కాలేజీ మరింత ఉన్నత గుర్తింపును సంతరించుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

రెడ్ శ్యాండిల్ కోర్టు స్పెషల్ పీపీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఏర్పాటు చేసిన రెడ్ శ్యాండిల్ కోర్టు న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అమరనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ లీగల్ అధ్యక్షుడిగా పనిచేశారు. తాజాగా ప్రభుత్వం ఈయన్ను రాష్ట్ర ఎర్రచందనం కోర్టుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తగు సాక్ష్యాధారాలతో ఎర్రచందనం స్మగ్లర్లకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

బ్యాంకర్లూ.. భద్రతా చర్యలు తీసుకోండి

● 'హిందూపురం' ఘటనతో అప్రమత్తం చేస్తున్న పోలీసులు



బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న అలిపిరి ఎస్ఐ అజిత

తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో జరిగిన బ్యాంకు దోపిడీ ఘటనతో తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా బుధవారం పోలీసు అధికారులు బృందాలుగా అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగులతో మాట్లాడి అప్రమత్తం చేశారు. ప్రతి బ్యాంకు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పూర్తి సామర్థ్యంతో సెక్యూరిటీ ఉండాలని సూచించారు. అనుమానితులు బ్యాంకుల వద్ద తిరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్, మురళీమోహన్, రామయ్య, ఎస్ఐలు తమ పరిధిలోని బ్యాంకుల వద్దకు వెళ్లి భద్రతకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. రానున్న వారం రోజుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ నియామకాలు పూర్తిచేసి మీ బ్యాంకులకు మీరే భద్రత ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

హోటళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లకు జరిమానాలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించిన పలు హోటళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లకు జరిమానా విధించినట్లు జేసీ శుభం బన్సల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో ఓ ఐస్‌క్రీమ్ పార్లర్‌కు రూ.50వేలు, రెస్టారెంట్లు,డాబాలకు రూ.1.15లక్షలు, సరైన లేబుల్ వివరాలు లేకుండా వాటర్ బాటిల్ విక్రయించినందుకు రూ.30వేలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థకు రూ.30వేలు, నాణ్యత లేని నెయ్యి విక్రయించినందుకు రూ.15వేలు, ఓ బేకరికి రూ.15వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. వివిధ ఆయిల్ సాల్ట్ ప్యాకెట్‌పై వినియోగదారులను తప్పుదోవ పట్టించిన వివరాలు ముద్రించిన సంస్థకు రూ.2లక్షలు, కాలపరిమితి ముగిసిన ఆహారపదార్థలను ఉంచినందుకు వ్యాపారికి రూ.15వేలు, ఇలా 20 కేసులకు సంబంధించి 4.92లక్షలు జరిమానా విధించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నలుగురు దొంగల ముఠా అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు
● రూ.20.4 లక్షల నగలు, రెండు బైకులు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీసులు బుధవారం కరుడుగట్టిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశారు. ఈ వివరాలను తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లా సేరిక్కలై గ్రామానికి చెందిన ఎం.మణి అలియాస్ కోవిల్‌మణి, ఎం.సురేష్ స్నేహితులు. వీరు తమిళనాడుతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. అలాగే, తిరుపతి నగరం మంగళం పరిధిలోని తిరుమల నగర్‌కు చెందిన స్నేహితులు కుమార్, మణికంఠ చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. అయితే వీరు గతంలో తమిళనాడులో దొంగతనాలు చేసి వేలూరు జైలులో ఉండగా, తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులతో పరిచయమైంది. ఆ తర్వాత ఈ నలుగురూ కలిసి కొన్నేళ్ళుగా తమిళనాడుతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నెల్లూరులోని పలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో నెల్లూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, వేలిముద్రలు పరిశీలించారు. వీరు చంద్రగిరి, పుత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఇళ్ల తాళాలు పగులకొట్టి బంగారు నగలు అపహరించుకుని వెళ్ళారు. ఈనెల 15న ఏర్పేడు పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటి ముందు నిలిపిన బైకును దొంగలించి నెల్లూరు వెళ్లారు. అక్కడ నవాబ్‌పేటలో ఇంటి ముందు ఆపి వున్న మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. ఈ రెండు మోటారు సైకిళ్లలో తిరుగుతూ పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల కోసం వేట మొదలు పెట్టారు.


క్రైం అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో..

పుత్తూరు, ఏర్పేడు, చంద్రగిరి, గాజులమండ్యం పరిధిలోని పెనుబాల కళాశాలలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో తిరుపతి క్రైం సీఐలు ప్రకాష్, శివకుమార్ రెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర, పుత్తూరు, కేవీబీ పురం, పిచ్చాటూరు ఎస్ఐలు ఓబయ్య, నరేష్, వెంకటేష్‌లతో పాటు జిల్లా క్రైం పార్టీలు దాము, నాగరాజు, రమేష్, మోహన్, రాజశేఖర్, భారుష, రవిప్రకాష్, మోహన్, మునిరత్నంను బృందాలుగా ఏర్పాటు చేశారు. వీరు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో బుధవారం పుత్తూరు- చెన్నై హైవేలోని సిరుగురాజుపాలెం సమీపంలో మురుగన్‌గుడి వద్ద నలుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు రూ.20.40 లక్షల విలువ చేసే 190 గ్రాముల బంగారు నగలు, 2.3 కిలోల వెండి వస్తువులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసుల్లో తమిళనాడు రాష్ట్రం చిదంబరానికి చెందిన ఎం.ప్రభు, వేలూరు జిల్లా అనైకట్టుకు చెందిన మణిగండన్ పరారీలో ఉన్నారు. కాగా, అరెస్టయిన వారిలో మణిపై 50, సురేష్‌పైన 15, కుమార్‌పై 18, మణికంఠపై 18 చొప్పున కేసులున్నాయి. ఈ కేసుల్లో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.



పుత్తూరు పోలీసులు రికవరీ చేసిన నగలు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ

షార్‌లో సంబరం



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

- జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
- నిర్ణీత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం
- షార్‌లో అంబరాన్నంటిన సంబరాలు

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మంది దాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్యాహ్నమే షార్‌కు తరలివచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజామునుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్‌ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలమైంది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్రదేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడనుంది.



వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి

చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగుల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో-నాసా సంయుక్త విజయం.

- వి.నారాయణన్, ఇస్రో చైర్మన్



మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ నారాయణన్




నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్



ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు

రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కె.రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.







రాకెట్ మొదటి, రెండవ, మూడవ దశలు

పీఎం శ్రీ పాఠశాలల్లో ఆగస్టు 15 వేడుకలకు నిధుల విడుదల

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ పాఠశాలల్లో ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.25 వేలు మంజూరు చేస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. పీఎం శ్రీ కింద చిత్తూరు జిల్లాలో ఎంపికైన 40 పాఠశాలల్లో ఆగస్టు 15న స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. జెండా, సౌండ్ సిస్టమ్‌కు రూ.2 వేలు, విద్యార్థులకు ఆటల పోటీల నిర్వహణకు రూ.5వేలు, చారిత్రక సంఘటనలపై స్కిట్ల నిర్వహణకు రూ.3వేలు,వ్యాసరచన,క్విజ్, పెయింటింగ్ పోటీలకు రూ.5 వేలు, పోస్టర్ తయారీ, సామాగ్రి, బహుమతులు, మిఠాయిలకు రూ.10 వేల చొప్పున ఖర్చు చేయాలని నిర్ణయించారు.పీఎం శ్రీ పాఠశాలలకు విడుదల చేసిన నిధులను ఆయా ప్రధానోపాధ్యాయులు,పాఠశాలల కమిటీల ద్వారా వినియోగించాల్సి ఉంది.

'పీఆర్ హెచ్‌ఎంలకు ఎంఈవోలుగా అవకాశం ఇవ్వాలి'

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఖాళీలైన ఎంఈవో-1 పోస్టులను పంచాయతీరాజ్ యాజమాన్యంలోని హెచ్‌ఎంలకు ఎంఈవోలకు సైతం కేటాయించి న్యాయం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కన్నన్ బుధవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు ఖాళీలు ఏర్పడిన ఎంఈవో-1 స్థానాల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లను (ఎఫ్‌ఏసీ) కింద నియమిస్తున్నారని, ఈ విధానాన్ని విరమించుకుని పంచాయతీరాజ్ పాఠశాలల్లోని హెచ్‌ఎంలకు అవకాశం కల్పించాలని కోరుతూ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

2003 డీఎస్సీలకు ఓపీఎస్ అమలు చేయాలి

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీలో ఎంపికైన టీచర్లకు కేంద్ర ప్రభుత్వ పెన్షన్ డిపార్టుమెంట్ ఇచ్చిన 57 మెమో ప్రకారం పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా 2003 డీఎస్సీ టీచర్లు ఓపీఎస్ పొందలేకపోవడం శోచనీయమన్నారు. వీరికి ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి వినతి పత్రం అందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

పాలసముద్రం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప బుధవారం తెలిపారు. వీర్లగుడి గ్రామానికి చెందిన దినేష్, చిరజీవి ఇద్దరు కలసి మండలంలోని ఆలయాల్లో హుండీలను పగలకొట్టి చోరీ చేయడం, అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసి అమ్ముకోవడం వృత్తిగా మార్చుకున్నారు. మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అధికం కావడంతో పోలీసులు రాత్రి పూట గస్తీలను ముమ్మరం చేశారు. దినేష్, చిరంజీవిలు చోరీ చేస్తున్నట్లు తెలియడంతో పోలీసులు నిఘా ఉంచి వారిని అరెస్టు చేసి నిందితుల వద్ద ఉన్న రాగి వైర్లను స్వాధీనపరచుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మానవ అక్రమ రవాణా పెద్ద నేరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీనియర్ జడ్జి ఎంఎస్ భారతి, అధికారులు

బంగారుపాళ్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, బానిసత్వం పెద్ద నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంఎస్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని జయంతి ఎస్టీ కాలనీలో రోప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చిత్తూరు, పోలీసు, జిల్లా గిరిజన సంక్షేమ, కార్మిక శాఖల అధికారులతో ప్రపంచ మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్ఎస్ఏ ఎంఎస్ భారతి.. మానవ అక్రమ రవాణ ఒక నేరం - దోపిడీకి ముగింపు పలుకుదాం అనే నినాదంపై ప్రసంగించారు. గిరిజనులు, వెనుకబడిన పేద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అక్రమ రవాణాకు సంబంధించిన చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం మానవ అక్రమ రవాణా,బానిసత్వం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఏవో భారతి, పీఎస్ఐ అశోక్‌కుమార్, రోప్స్ సంస్థ చైర్మన్ ధనశేఖర్, కో ఆర్డినేటర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.







ఐవోసీఎల్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఏఎస్పీ శివానందకిశోర్ తదితరులు - పేలుడు పదార్థాల గుర్తింపు - పేలుడు పదార్థాల నిర్వీర్యం

ఐవోసీఎల్‌లో మాక్ డ్రిల్


యాదమరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్)లో ఏఎస్పీ శివానంద కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు.బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు అన్ని శాఖలూ సమన్వయంతో వెంటనే స్పందించి సమర్థవంతంగా ఎదుర్కొనేలా అప్రమత్తంగా ఉండడమే మాక్‌డ్రిల్ లక్ష్యమని ఏఎస్పీ తెలిపారు.ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్ఐ ఈశ్వర్, తహసీల్దార్ పార్థసారధి, ఐవోసీఎల్ చీఫ్ టెర్మినల్ మేనేజర్ ప్రసాద్ రావు, బి.డి. టీం సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.68కోట్లు



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.2,68,87,640 లభించింది. ఆలయంలోని కోట మండపం వద్ద బుధవారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల హుండీల ద్వారా బంగారం 97 గ్రాములు, వెండి 882.640 కేజీలు, విదేశీ కరెన్సీ 235 వచ్చాయి. 40 రోజులకు ఈ హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం కొనసాగింపు



ఉత్తర్వులతో వీసీ ఉమ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఏర్పాటైన శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధనా విభాగాన్ని 2025-26 విద్యాసంవత్సరం కూడా పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విభాగం ద్వారా నూతన ఆవిష్కరణలతో కూడిన సంస్థలకూ, వ్యక్తులకూ రూ.2 నుంచి 10 లక్షల నిధులు మంజూరు చేసే అధికారం ఈ సంస్థకు ఉంది. ఈ విభాగానికి కో-ఆర్డినేటర్‌గా జ్యోత్స్న, కో కో-ఆర్డినేటర్‌గా సుజాత వ్యవహరిస్తున్నారు. ఈ విభాగానికి మరో ఏడాది పాటు కాల పరిమితిని పొడిగించడం పట్ల వీసీ ఉమ హర్షం వ్యక్తం చేశారు.

వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా శ్రీలత

తిరుపతిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ సీహెచ్ శ్రీలతను నియమిస్తూ బుధవారం వర్సిటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ గురువారం రిటైర్ కానుండడంతో వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీలతకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు శ్రీలత ఈ పదవిలో కొనసాగుతారు.

గృహనిర్మాణ రంగంలో పురోగతి సాధించాలి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ రంగంలో పురోగతి సాధించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఎన్టీఆర్ గృహనిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో హౌసింగ్ డీఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యటించి ఇంకా ప్రారంభంకాని ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ఒప్పించాలన్నారు. జిల్లా అంతటా 73,098 ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 52,880 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. నిర్మాణం జరుగుతున్న నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ సుబ్రహ్మణ్యం, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి

కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

చిత్తూరు లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):ఇటీవల ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన నిందితులకు చిత్తూరు న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. ఈనెల 9వ తేదీన బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు మాజీ సీఎం జగన్ విచ్చేసిన సందర్భంగా ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై వైసీపీకి చెందిన చక్రవర్తి, శంకర్ ఆచారి, వినోద్ కుమార్, మోహన్ దాడిచేశారు. ఈ ఘటనలో బంగారుపాళ్యం పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితులు ఫస్ట్ ఏడీజే కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేసుకున్నారు. ఆ పిటీషన్ బుధవారం విచారణకు రాగా బెయిల్ పిటీషన్‌ను న్యాయమూర్తి రమేష్ డిస్మిస్ చేశారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్టు



నిందితులతో పోలీసులు

చిత్తూరు అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ మహేశ్వర కథనం మేరకు..బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వెనకవైపు తచ్చాడుతున్న చిత్తూరు ప్రశాంత్‌నగర్‌కు చెందిన సురేష్, రంగాచారి వీధికి చెందిన కుమార్, ఇరువారం ప్రాంతానికి చెందిన ప్రభాకర్, పూతలపట్టు మండలం బండపల్లికి చెందిన సీతారాములును పోలీసులు పట్టుకుని 1300 గ్రాముల గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గుర్తింపు లేని ఆటో ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోండి : టీడీపీ

చిత్తూరు అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలతో సామాన్యుల్ని వేధిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠకు టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్ బుధవారం ఫిర్యాదు చేశారు. రాకెట్ వడ్డీ, ఎక్స్‌ప్రెస్ వడ్డీ, రోజువారీ వడ్డీ పేరుతో సామాన్యుల రక్తం తాగడమే కాక మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.చదువురాని వాళ్లకు డబ్బులిచ్చి వాళ్ళ ఆస్తులను కాజేస్తుండడంతో కొందరు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడుతున్నారని వివరించారు. అలాంటి వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.మరోవైపు గుర్తింపులేని ఆటో ఫైనాన్స్ కంపెనీలు వాహనాలకు అధిక వడ్డీతో రుణాలు ఇచ్చి.. ఆ తర్వాత ఆ వాహనాలను తీసుకెళ్లి పోతున్నారని తెలిపారు.ఆయన వెంట తెలుగు యువత కార్యదర్శి వినోద్ కుమార్, చారాల వినోద్ కుమార్, జైపాల్ వున్నారు.

అమరనాథరెడ్డికి ఘనసన్మానం



అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ప్రసాద్‌నాయుడు, పాలకవర్గ సభ్యులు

పలమనేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని బుధవారం పలమనేరులోని ఆయన కార్యాలయంలో గంగవరం సింగిల్ విండో అధ్యక్షులు ప్రసాద్‌నాయుడు, పాలకవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. తమపై నమ్మకంతో సింగిల్ విండో పదవి అందించినందుకు ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలియజేశారు. మండలంలోని రైతుల సంక్షేమానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పత్తికొండ హరిబాబు, శివరామిరెడ్డి, గంగవరం మండల టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు, మురళి, ఆనంద్, గిరిదర్ గోపాల్, యుగంధర్, బాలాజీ, మన్నారునాయనిపల్లి ఆనందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభ పూజలకు ఆహ్వానం

పలమనేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆల య అర్చకులు కుమార్ గురుకుల్, చంద్రమౌళి గురు కుల్, రాఘవేంద్ర బుధవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి ఆలయ మర్యాదలతో ధ్వజ స్తంభ పూజలకు ఆహ్వానించారు. ఆగస్టు 7న ధ్వజ స్తంభానికి ఎంపిక చేసిన 60 అడుగుల పొడవైన టేకు కొయ్యను పట్టణానికి తీసుకురానున్నారని.. శాస్త్రోక్తంగా పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి తప్పకుండా రావాలని ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను ఆశీర్వదించి ఆలయ తీర్థప్రసాదాలను అందజేశారు.

మహిళపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



డీఎస్పీని కలిసేందుకు వచ్చిన నాగాలమ్మ ఆలయ కమిటీ, బీజేపీ నాయకులు

పలమనేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గంగవరం సమీపంలోని నాగాలమ్మ ఆలయానికి వస్తున్న మహిళపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆలయానికి వస్తున్న మహిళపై ఓ వ్యక్తి దాడిచేశాడని, దీనిపై గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడిని అరెస్టు చేయలేదని వివరించారు. విచారించి న్యాయం చేస్తామని డీఎస్పీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుహళేంది, సుధాకర్ రెడ్డి, ఆయిల్‌రాము, రాము, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎం.శరవణకుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షులు వంశీ, కార్యదర్శి జగన్, ప్రసాద్, గౌతమ్ పాల్గొన్నారు.

మహాత్మాపూలే సేన రాష్ట్ర అధ్యక్షుడిగా బాలసుబ్రహ్మణ్యం



పలమనేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాపూలే సేన రాష్ట్ర అధ్యక్షుడిగా పలమనేరుకు చెందిన పి.బి.బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఆ మేరకు మహాత్మాపూలే జాతీయ అధ్యక్షులు మన్నేపల్లి నాగేశ్వరరావు పి.బి.బాలసుబ్రహ్మణ్యంకు నియామకపు ఉత్తర్వులు పంపారు. రాష్ట్ర కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం రెండుసార్లు పనిచేసిన అనుభవాన్ని గుర్తించి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు. బీసీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఏనుగుల దాడులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : చల్లా



రొంపిచెర్లతో పర్యటించిన చల్లా బాబు

రొంపిచెర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అటవీ ప్రాంత మండలాల్లో ఏనుగుల దాడులతో నష్టాలతో పాటు రైతుల ప్రాణాలు బలికొంటున్నాయని సోమల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, రమేష్‌నాయుడులతో పాటు పులిచెర్ల మండల నాయకులు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి బుధవారం ఆయన నివాసం వద్ద కలిసి విన్నవించారు. సోమల మండలంలో బోనమంద, 81 ఉప్పరపల్లె, పట్రపల్లె, కొత్తూరు, సోమల ప్రాంతాల్లో ఏనుగులు దాడులు చేస్తున్నాయని వాపోయారు. స్పందించిన చల్లా బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సమస్యను తెలియజేసి పరిష్కార చర్యలకు కృషి చేస్తానన్నారు. అలాగే పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచి ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ సర్పంచి రవికుమార్‌నాయుడు, గోపీ, రఘునాథ్, చంగల్‌రెడ్డి, నూరుబాషా, కొండామురళీ, ధనంజయనాయుడు, మహేష్, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వతో ఖచ్చితమైన యాజమాన్య హక్కులు

చౌడేపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ పథకంతో ఖచ్చితమైన యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు ఎంపీడీవో లీలా మాధవి అన్నారు. బుధవారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్వామిత్వ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలోని ఇళ్లను, ఖాళీ స్థలాలను సర్వేచేసి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. సర్వే అనంతరం వారికి ప్రాపర్టీ పర్సనల్ నంబర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శివన్న, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉత్తర గోగ్రహణం



ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని తెలియజేస్తున్న భాగవతారిణి

సోమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కందూరు రైతు సేవా కేంద్ర వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ఉత్తర గోగ్రహణం ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉభయదారులు పి.రమణయ్య, ఎస్.రామకృష్ణ కుటుంబ సభ్యులు పంచపాండవుల విగ్రహాలకు అభిషేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భాగవతారిణి గీతాశ్రీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి. శ్రీనివాసులు, కందూరు, మిట్టపల్లె, బాలప్పగారిపల్లె, కామిరెడ్డి వారిపల్లె, వల్లిగట్ల తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

సోమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కృష్ణదేవరాయ సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు ఈనెల 31న భూమి పూజ చేయనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మునివెంకటప్ప, ఎస్‌వీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.11 లక్షల వ్యయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి మండలంలోని శ్రీకృష్ణదేవరాయల అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా పాలేటమ్మ ఊరేగింపు



సోమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పాలేటమ్మ అమ్మవారి గ్రామోత్సవాల్లో భాగంగా బుధవారం సోమల పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ మూర్తిని పోతురాజు విన్యాసాలతో ఘనంగా ఊరేగించారు. ఈక్రమంలోనే పాయల కుటుంబ సభ్యులు అమ్మవారికి పుట్టింటి సంప్రదాయాలతో చీర సారెలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన ం చేశారు. కార్యక్రమాల్లో పాయల నాగరాజ, అమరనాథ్, శివకుమార్, జగన్‌మోహన్, గంగాధరం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరెడ్డి

రొంపిచెర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని మోటుమల్లెల పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి అన్నా రు. మోటుమల్లెల నగరిలో పౌరహక్కుల దినం కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు ఇళ్ల దగ్గరగా పేడ దిబ్బలు వేయరాదని.. పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భూసమస్యలు, విద్యుత్, ప్రతి ఇంటికీ బ్యాంకు ఖాతా, తాగునీరు, గ్యాస్ వంటి నిత్యావసరాలు కలిగి ఉన్నారా.. లేదా తెలుసుకొని తగిన పరిష్కరించాలన్నారు. శ్మశానవాటిక కోసం స్థలం చూపాలని తహసీల్దారు అమర్‌నాథ్‌ను గ్రామస్తులు కోరగా ఆయన స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ యోగానందం, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుప్పం ఆయుర్వేద వైద్యశాలకు

కాంపౌండర్ కావలెను!



కుప్పంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

కుప్పం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల దినదిన ప్రవర్ధమానవుతోంది. అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకుంటూ రోగులకు సేవలందించడంలో ముందుంటోంది. అయితే ఈ వైద్యశాలలో కాంపౌండర్ పోస్టు ఖాళీగా ఉండటంతో సేవలు అందించడంలో ఒకింత వెనుకబడుతోంది.

కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలోనే ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఉంది. ఈ ఆయుర్వేద వైద్యశాల నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ (ఎన్‌ఏబీహెచ్, నాబ్) గుర్తింపు కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకుంది. ఈ గుర్తింపు లభిస్తే జాతీయ స్థాయిలోని వైద్యశాలల జాబితాలో కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల పేరు చేరుతుంది. అందుకు తగిన విధంగానే అన్నిరకాల సదుపాయాలు సమకూరుతాయి. అయితే ఇందుకోసం ప్రభుత్వం తరఫున కొంత కసరత్తు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కసరత్తుకు అనుగుణంగా నేషనల్ ఆయుష్ మిషన్ ఈ వైద్య శాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకానికి ఎంపిక చేసింది. దీని కింద అవసరమైన అన్నిరకాల సదుపాయాలు ఇప్పటికే కల్పించింది. అవసరమైన ఫర్నిచర్, విశాలమైన యోగా హాలు, ఔషధ మొక్కల పెంపకం వంటివన్నీ సమకూరాయి. అయితే ఈ సదుపాయాలన్నీ సమకూర్చుకుని నాబ్ గుర్తింపుకోసం సిద్ధమయ్యామని సంబర పడేలోగానే కుప్పం ఆయుర్వేద వైద్యశాలలో కాంపౌండర్‌గా పనిచేస్తున్న మహిళ రిటైర్డు అయిపోయారు. ప్రస్తుతం ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆయుర్వేద వైద్యురాలైన హేమలత ఒక్కరే అటు డాక్టర్, ఇటు కాంపౌండర్ విధులు చేపడుతున్నారు. నాబ్ గుర్తింపు రావాలంటే ఆస్పత్రిలోని పోస్టులన్నీ భర్తీ అయి ఉండాలి. అంతేకాక రోగులకు సరైన వైద్యం అందించాలన్నా కనీసం కాంపౌండర్ పోస్టు భర్తీ కావాలి. ఈ విషయాన్ని ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం డిప్యుటేషన్‌పై అయినా కాంపౌండర్ పోస్టును భర్తీ చేసే ప్రయత్నాలు చేస్తోంది. ఆ ప్రయత్నాలు త్వరలో పూర్తిచేసి కాంపౌండర్ పోస్టులో ఎవరో ఒకరిని నియమించాల్సిన అవసరం ఉంది. అప్పుడే నాబ్ గుర్తింపు రేసులో కుప్పం ఆయుర్వేద వైద్యశాల ముందు వరుసలో ఉండేందుకు అవకాశం కలుగుతుంది.

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



వనమలదిన్నెలో ఇంటింటా పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వనమలదిన్నెలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికాంలోకి వచ్చి ఏడాది కాలంలో రాష్ట్రానికి పరిశ్రమలు రావడంతో పాటు ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దోపిడీలు, దౌర్జన్యాలు చేసి ప్రజలను భయాందోళనకు గురిచేశారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శమీపతి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసుగిరి, శ్రీకాంత్, గిరాబాబు, చలపతినాయుడు, రెడ్డెప్పనాయుడు, ప్రసాద్‌స్వామి, సుహేల్‌బాషా, ఇబ్రహీం, నౌషాద్, సద్దాంహుసేన్, షామీర్, చంద్ర, రామయ్య, గంగాధర్, రమణ, సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ, జనసేన నాయకులు విరూపాక్షి, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, హరినాయక్, బాలాజీ నాయక్, నాగరాజనాయక్, కుమార్, శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్ తదితరులు

గుడుపల్లె, జూలై 30 (ఆంధజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయ వద్ద అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారధి, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులు, సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండలాధ్యక్షులు బాబు నాయుడు, మాజీ ఎంపీపీ మునిరాజు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, హేమాంబర్ గౌడ్, సుబ్బు, భానుమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.49 కోట్లతో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణం



పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

శాంతిపురం, రామకుప్పం జూలై 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం లోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని రూ.3.49 కోట్లతో పునః నిర్మించనున్నట్లు దేవాదాయ శాఖ డీఈ జనార్దన్ తెలిపారు. బుధవారం నిర్మాణాలు చేపట్టే స్థలాలను పరిశీలించారు. ఆలయంలో వార్షిక సోమవారోత్సవాలు పూర్తయిన వెంటనే పునర్నిర్మాణం పనులు ప్రారంభిస్తామన్నారు. ఆలయ పునర్నిర్మాణంతోపాటు కల్యాణ కట్ట, పుష్కరిణిలను సుందరంగా నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఏఈ ఆనంద్, ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు సీతాపతి, మాజీ సర్పంచి రామకృష్ణప్ప, న్యాయవాది మధుసూదన్, ఆలయ మేనేజర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ సంఘటన సంస్థ కో ఆర్డినేటర్‌గా ప్రసాద్



పుంగనూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరుకు చెందిన ఎస్ఆర్. వెంటకట ప్రసాద్‌ను రాష్ట్ర బ్రాహ్మణ సంఘటన సంస్థ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేస్తూ సంస్థ వ్యవస్థాపకుడు వేమూరి ఆనందసూర్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంటకప్రసాద్ మాట్లాడుతూ సంస్థ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిందని, బ్రాహ్మణ కులస్తుల అభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణ కులస్తులు ఆయనకు అభినందలు తెలిపారు.

పోలీసు వ్యవస్థ కీలకం



మానవ అక్రమ రవాణా వ్యతిరేక దిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసులు

పుంగనూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో న్యాయ, పోలీసు వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తాయని ఎస్ఐ రమణ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల్లో చైతన్యం పెరగాలన్నారు. కార్యక్రమంలో జనచైతన్య సంస్థ అధ్యక్షురాలు శ్రావణి, సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

దండికుప్పం వసతి గృహం తనిఖీ

శాంతిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దండికుప్పం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు సక్రమంగా భోజనం పెడుతున్నారా అని తెలుసుకుంటూ భోజనాలను రుచిచూశారు. ఈవోపీఆర్డీ రవినాయక్, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సాగునీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు

శాంతిపురం, రామకుప్పం 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో సాగునీటి కొరత రాకుండా చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి తెలిపారు. బుధవారం రామకుప్పం పట్టణ శివార్లలోని కనమనాయనపల్లె చెరువు నుంచి మిట్టపల్లె పెద్ద చెరువు వరకు గల సప్లైఛానల్ పూడిక తీత పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దచెరువు సాగునీటి సంఘం చైర్మన్ పద్మనాభరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, నేతలు గంట్లారెడ్డి, సలంసాబ్, టీవీ రవి, ఆదిల్, అవినాష్, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, బాలరాజు, మంజునాథ్, సుబ్రహ్మణ్యం, దయానంద, అంజి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అజెండాగా చంద్రబాబు సింగపూర్ పర్యటన

శాంతిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అజెండాగా చంద్రబాబు సింగపూర్ పర్యటన సాగుతోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం వెంకటేపల్లె గ్రామంలో ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ పడగొట్టడం అంటే ఏమిటో ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టడం అంటే ఏంటో చూపుతున్నారని తెలిపారు. నిలబెట్టాలన్నా, నిర్మాణం చేయాలన్నా.. చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని మరోసారి సింగపూర్ టూర్‌తో రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సుస్థిర పాలన, పారదర్శక విధానాలు, పాలసీలు, సమర్థ నాయకత్వం చూసి సింగపూర్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తామని స్పష్టంగా చెప్పిందని తెలిపారు.

షార్‌లో సంబరం



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం



- జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
- నిర్ణీత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం
- షార్‌లో అంబరాన్నంటిన సంబరాలు

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్

చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగుల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో,నాసా సంయుక్త విజయం.

- వి.నారాయణన్, ఇస్రో చైర్మన్

మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ నారాయణన్

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మంది దాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్నాహ్నమే షార్‌కు తరలివచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజామునుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలమైంది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్రదేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడనుంది.




వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి




ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు

రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కె.రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.







రాకెట్ మొదటి, రెండవ, మూడవ దశలు

పీఎం శ్రీ పాఠశాలల్లో ఆగస్టు 15 వేడుకలకు నిధుల విడుదల

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ పాఠశాలల్లో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.25 వేలు మంజూరు చేస్తూ సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. పీఎం శ్రీ కింద చిత్తూరు జిల్లాలో ఎంపికైన 40 పాఠశాలల్లో ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. జెండా, సౌండ్ సిస్టమ్‌కు రూ.2 వేలు, విద్యార్థులకు ఆటల పోటీల నిర్వహణకు రూ.5వేలు, చారిత్రక సంఘటనలపై స్కిట్ల నిర్వహణకు రూ.3వేలు,వ్యాసరచన,క్విజ్, పెయింటింగ్ పోటీలకు రూ.5 వేలు, పోస్టర్ తయారీ, సామగ్రి, బహుమతులు, మిఠాయిలకు రూ.10 వేల చొప్పున ఖర్చు చేయాలని నిర్ణయించారు.పీఎం శ్రీ పాఠశాలలకు విడుదల చేసిన నిధులను ఆయా ప్రధానోపాధ్యాయులు,పాఠశాలల కమిటీల ద్వారా వినియోగించాల్సి ఉంది.

'పీఆర్ హెచ్‌ఎంలకు ఎంఈవోలుగా అవకాశం ఇవ్వాలి'

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఖాళీలైన ఎంఈవో-1 పోస్టులను పంచాయతీరాజ్ యాజమాన్యంలోని హెచ్‌ఎంలకు ఎంఈవోలకు సైతం కేటాయించి న్యాయం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కన్నన్ బుధవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు ఖాళీలు ఏర్పడిన ఎంఈవో-1 స్థానాల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లను (ఎఫ్‌ఏసీ) కింద నియమిస్తున్నారని, ఈ విధానాన్ని విరమించుకుని పంచాయతీరాజ్ పాఠశాలల్లోని హెచ్‌ఎంలకు అవకాశం కల్పించాలని కోరుతూ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

2003 డీఎస్సీలకు ఓపీఎస్ అమలు చేయాలి

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీలో ఎంపికైన టీచర్లకు కేంద్ర ప్రభుత్వ పెన్షన్ డిపార్టుమెంట్ ఇచ్చిన 57 మెమో ప్రకారం పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా 2003 డీఎస్సీ టీచర్లు ఓపీఎస్ పొందలేకపోవడం శోచనీయమన్నారు. వీరికి ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి వినతి పత్రం అందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

పాలసముద్రం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప బుధవారం తెలిపారు. వీర్లగుడి గ్రామానికి చెందిన దినేష్, చిరజీవి ఇద్దరు కలసి మండలంలోని ఆలయాల్లో హుండీలను పగలకొట్టి చోరీ చేయడం, అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసి అమ్ముకోవడం వృత్తిగా మార్చుకున్నారు. మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అధికం కావడంతో పోలీసులు రాత్రి పూట గస్తీలను ముమ్మరం చేశారు. దినేష్, చిరంజీవిలు చోరీ చేస్తున్నట్లు తెలియడంతో పోలీసులు నిఘా ఉంచి వారిని అరెస్టు చేసి నిందితుల వద్ద ఉన్న రాగి వైర్లను స్వాధీనపరచుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మానవ అక్రమ రవాణా పెద్ద నేరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీనియర్ జడ్జి ఎంఎస్ భారతి, అధికారులు

బంగారుపాళ్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, బానిసత్వం పెద్ద నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంఎస్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని జయంతి ఎస్టీ కాలనీలో రోప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చిత్తూరు, పోలీసు, జిల్లా గిరిజన సంక్షేమ, కార్మిక శాఖల అధికారులతో ప్రపంచ మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్ఎస్ఏ ఎంఎస్ భారతి.. మానవ అక్రమ రవాణ ఒక నేరం - దోపిడీకి ముగింపు పలుకుదాం అనే నినాదంపై ప్రసంగించారు. గిరిజనులు, వెనుకబడిన పేద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అక్రమ రవాణాకు సంబంధించిన చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం మానవ అక్రమ రవాణా,బానిసత్వం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఏవో భారతి, పీఎస్ఐ అశోక్‌కుమార్, రోప్స్ సంస్థ చైర్మన్ ధనశేఖర్, కో ఆర్డినేటర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.







ఐవోసీఎల్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఏఎస్పీ శివానందకిశోర్ తదితరులు - పేలుడు పదార్థాల గుర్తింపు - పేలుడు పదార్థాల నిర్వీర్యం

ఐవోసీఎల్‌లో మాక్ డ్రిల్

యాదమరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్)లో ఏఎస్పీ శివానంద కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు.బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు అన్ని శాఖలూ సమన్వయంతో వెంటనే స్పందించి సమర్థవంతంగా ఎదుర్కొనేలా అప్రమత్తంగా ఉండడమే మాక్‌డ్రిల్ లక్ష్యమని ఏఎస్పీ తెలిపారు.ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్ఐ ఈశ్వర్, తహసీల్దార్ పార్థసారథి, ఐవోసీఎల్ చీఫ్ టెర్మినల్ మేనేజర్ ప్రసాద్ రావు, బి.డి. టీం సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.68కోట్లు



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.2,68,87,640 లభించింది. ఆలయంలోని కోట మండపం వద్ద బుధవారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల హుండీల ద్వారా బంగారం 97 గ్రాములు, వెండి 882.640 కేజీలు, విదేశీ కరెన్సీ 235 వచ్చాయి. 40 రోజులకు ఈ హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం కొనసాగింపు



ఉత్తర్వులతో వీసీ ఉమ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఏర్పాటైన శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధనా విభాగాన్ని 2025-26 విద్యాసంవత్సరం కూడా పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విభాగం ద్వారా నూతన ఆవిష్కరణలతో కూడిన సంస్థలకూ, వ్యక్తులకూ రూ.2 నుంచి 10 లక్షల నిధులు మంజూరు చేసే అధికారం ఈ సంస్థకు ఉంది. ఈ విభాగానికి కో-ఆర్డినేటర్‌గా జ్యోత్స్న, కో కో-ఆర్డినేటర్‌గా సుజాత వ్యవహరిస్తున్నారు. ఈ విభాగానికి మరో ఏడాది పాటు కాల పరిమితిని పొడిగించడం పట్ల వీసీ ఉమ హర్షం వ్యక్తం చేశారు.

వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా శ్రీలత

తిరుపతిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ సీహెచ్ శ్రీలతను నియమిస్తూ బుధవారం వర్సిటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ గురువారం రిటైర్ కానుండడంతో వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీలతకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు శ్రీలత ఈ పదవిలో కొనసాగుతారు.

గృహనిర్మాణ రంగంలో పురోగతి సాధించాలి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ రంగంలో పురోగతి సాధించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఎన్టీఆర్ గృహనిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో హౌసింగ్ డీఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యటించి ఇంకా ప్రారంభంకాని ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ఒప్పించాలన్నారు. జిల్లా అంతటా 73,098 ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 52,880 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. నిర్మాణం జరుగుతున్న నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ సుబ్రహ్మణ్యం, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి

కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

చిత్తూరు లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):ఇటీవల ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన నిందితులకు చిత్తూరు న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. ఈనెల 9వ తేదీన బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు మాజీ సీఎం జగన్ విచ్చేసిన సందర్భంగా ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై వైసీపీకి చెందిన చక్రవర్తి, శంకర్ ఆచారి, వినోద్ కుమార్, మోహన్ దాడిచేశారు. ఈ ఘటనలో బంగారుపాళ్యం పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితులు ఫస్ట్ ఏడీజే కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేసుకున్నారు. ఆ పిటీషన్ బుధవారం విచారణకు రాగా బెయిల్ పిటీషన్‌ను న్యాయమూర్తి రమేష్ డిస్మిస్ చేశారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్టు



నిందితులతో పోలీసులు

చిత్తూరు అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ మహేశ్వర కథనం మేరకు..బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వెనకవైపు తచ్చాడుతున్న చిత్తూరు ప్రశాంత్‌నగర్‌కు చెందిన సురేష్, రంగాచారి వీధికి చెందిన కుమార్, ఇరువారం ప్రాంతానికి చెందిన ప్రభాకర్, పూతలపట్టు మండలం బండపల్లికి చెందిన సీతారాములును పోలీసులు పట్టుకుని 1300 గ్రాముల గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గుర్తింపు లేని ఆటో ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోండి : టీడీపీ

చిత్తూరు అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలతో సామాన్యుల్ని వేధిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠకు టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్ బుధవారం ఫిర్యాదు చేశారు. రాకెట్ వడ్డీ, ఎక్స్‌ప్రెస్ వడ్డీ, రోజువారీ వడ్డీ పేరుతో సామాన్యుల రక్తం తాగడమే కాక మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.చదువురాని వాళ్లకు డబ్బులిచ్చి వాళ్ళ ఆస్తులను కాజేస్తుండడంతో కొందరు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడుతున్నారని వివరించారు. అలాంటి వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.మరోవైపు గుర్తింపులేని ఆటో ఫైనాన్స్ కంపెనీలు వాహనాలకు అధిక వడ్డీతో రుణాలు ఇచ్చి.. ఆ తర్వాత ఆ వాహనాలను తీసుకెళ్లి పోతున్నారని తెలిపారు.ఆయన వెంట తెలుగు యువత కార్యదర్శి వినోద్ కుమార్, చారాల వినోద్ కుమార్, జైపాల్ వున్నారు.

గుడిపాల కమ్యూనిటీ నిర్వహణ శిక్షణా కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. స్థానిక చిత్తూరు డీఆర్‌డీఏ జిల్లా కమ్యూనిటీ భవన ప్రాంగణంలో గుడిపాల మండల కమ్యూనిటీ నిర్వహణ శిక్షణా కేంద్రాన్ని నగర మేయర్ అముద, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవితో కలిసి ఎమ్మెల్యే బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడిపాల మండల గ్రామీణ మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించడానికి కమ్యూనిటీ సెంటర్‌లో వివిధ అంశాలపై రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా కమ్యూనిటీ శిక్షణా కేంద్రం పనిచేస్తోందన్నారు. సమావేశంలో గుడిపాల మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై వైద్యసిబ్బందికి శిక్షణ

నగరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): దోమల నివారణపై వైద్యసిబ్బంది, పారిశుధ్య కార్మికులకు నగరి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో కీటక జనిత తాగునీరు వలన ప్రబలే వ్యాధుల గురించి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వైద్యసిబ్బంది, పురపాలక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు అవసరమైన సూచనలివ్వాలన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని, చెత్తా, చెదారం పడేసేందుకు డస్ట్‌బిన్‌లను వాడాలని సూచించారు. వైద్యాధికారులు ఎయిల్ అరసన్, బిందు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం వైద్య, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.1.15 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), జూలై 30(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పూతలపట్టు మండలం బందార్లపల్లెకు చెందిన కొంగర నవీన్ రూ.1,15,000 డీడీ రూపంలో విరాళంగా బుధవారం సాయంత్రం అందించారు. విరాళ దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతకు స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు శేషాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డీడీని విరాళంగా అందిస్తున్న నవీన్

వరసిద్ధుడిని దర్శించుకున్న సినీ నటులు

ఐరాల(కాణిపాకం), జూలై 30(ఆంధ్రజ్యోతి): సినీ నటులు ఆనందరామ రాజు, సుదర్శన్, మదన్, సాయి బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.



తాగునీటి సమస్య పరిష్కరించండి


ఎస్టీ కాలనీలో బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

విజయపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరం ఎస్టీ కాలనీలో వారం రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తాగునీటికోసం రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సమీపంలోని చిన్నజంబాడ వద్దకు తాగునీటి కోసం వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. తాగునీటి సమస్యపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సామాన్యులకు చేరువలో టీడీపీ ప్రభుత్వం

విజయపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు చేరువలో టీడీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉన్నాయని కోసలనగరం సింగిల్ విండో అధ్యక్షుడు బాబుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాళికాపురం, మాధవరం, పన్నూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కపిల్, బెంజిమన్, బాబు, లక్ష్మీపతి, దొరైరాజ్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

చిత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో అనుమతుల్లేకుండా వేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ నాగేంద్ర చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2025 జూన్ 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తు గడువును 90 రోజులు విధించారన్నారు. లేఅవుట్‌లోని ప్రతి ప్లాట్‌కు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని ఉండాలన్నారు. పది శాతం ఓపెన్‌స్పేస్ లేకుంటే 14 శాతం అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. పాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన పోర్టల్ ఆగస్టు ఒకటవ తేది నుంచి అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న యజమానులు పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. నగరంలో సుమారు 33 లే అవుట్లలో వంద ఎకరాల వరకు క్రమబద్ధీకరించుకోవాల్సి ఉందన్నారు. అనేక సంవత్సరాలుగా క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్న వారు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాజూరు చెరువు సుందరీకరణకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కాజూరు చెరువులో ముళ్లకంపల తొలగింపు, సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ భూమిపూజ చేశారు. బుధవారం చెరువు వద్ద ఎమ్మెల్యే, మేయర్ అముద తదితరులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ మురళీ కుమార్, డీఈ హీరాలాల్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, కార్పొరేటర్ అశోక్, నేతలు కాజూరు బాలాజీ, కాజూరు రాజేష్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరం

గంగాధరనెల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం కోసమే గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గురుప్రకాష్ అన్నారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎగవూరు సత్యమ్మ గుడివద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 54మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భగవతి, సంపత్, ఎంపీహెచ్ఏలు సుధాకర్, కదిరివన్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

ఐరాల(కాణిపాకం), జూలై 30(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ కోఆర్డినేటర్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం కాణిపాకంలోని ఓ కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని అన్ని గ్రామాల్లోకి తీసుకెళ్లి పటిష్ఠం చేయాలని కోరారు. అనంతరం ఏపీసీసీ మాజీ కార్యదర్శి ఏపీ.పరదేశి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పార్టీ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులందరూ కష్టపడి పని చేసి పార్టీకోసం పాటుపడాలన్నారు. యువకులను పార్టీలోకి తీసుకోవాలని అన్నారు. నాగరాజు నాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

కాణిపాకంలో వాహనాలను ఒక వైపే నిలపండి

ఐరాల(కాణిపాకం), జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా నిలపకుండా ఒక వైపు మాత్రమే నిలపాలని ఎస్ఐ నరసింహులు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాణిపాకంలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి వాహనాలను ఒక్కో రోజు ఒక వైపున నిలబెట్టాలని సూచించారు. ఎవరైనా తమ వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

డైట్‌లో సమస్యలను పరిష్కరించండి

వెదురుకుప్పం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని డైట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి విన్నవించినట్లు ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ పొన్న బుధవారం తెలిపారు. ఈ నెల 25వ తేదిన ఆంధ్రజ్యోతిలో 'డైట్‌కెళ్లే రోడ్డును బాగు చేయరూ..?' అన్న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోడ్డు వసతితో పాటు డైట్‌కు కావలసిన వసతులను ఏర్పాటు చేయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

డిస్టిలరీ ఫ్యాక్టరీ తనిఖీ


డిస్టిలరీ ఫ్యాక్టరీలో వివరాలు సేకరిస్తున్న విజయ్ కుమార్

శ్రీరంగరాజపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయి వద్ద ఉన్న ఎస్ఎస్‌జే డిస్టిలరీ ఫ్యాక్టరీని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయకుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డిస్టిలరీ ఫ్యాక్టరీ పరిసరాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలన్నారు. ఫ్యాక్టరీలోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎక్సైజ్ అధికారులు, ఫ్యాక్టరీ ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఏజీఎం రవి కుమార్, హెచ్ఆర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం సామాన్యుడికి విలువైన శక్తి


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

నగరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సామాన్యుడికి విలువైన శక్తితో సమానమని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. సమాచారహక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఆర్‌టీఐ విభాగం సంయుక్తంగా ఏర్పాటుచేసిన సమావేశానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన సౌమ్య, నాగలింగం, మోహన్, భవ్య, మోనిసా, గాయత్రి, పవిత్రలకు డీఎస్పీ అజీజ్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణగోపాల్, అధ్యాపకులు ప్రియదర్శిని, వేణుగోపాల్, మహేశ్వరి, పంకజం, భాస్కర్, గోపి రామానుజులు, చిన్నపాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సకాలంలో టీకాలు అందించండి


పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

పాలసముద్రం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భిణులకు సకాలంలో టీకాలు అందించాలని డీఎంహెచ్‌వో సుధారాణి వైద్యులను ఆదేశించారు. బుధవారం ఆమె పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గర్భిణులకు అందుతున్న టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఐవో డాక్టర్ హనుమంతరావు, పీహెచ్‌సీ డాక్టర్లు మోహనకృష్ణ, డాక్టర్ జయకుమార్ పాల్గొన్నారు.

● వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె పీహెచ్‌సీలో రికార్డులను డీఎంహెచ్‌వో సుధారాణి తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన వసతి, ఇతర మౌలిక సదుపాయాలపై డాక్టర్ భువనేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి(డీఐవో) డాక్టర్ హనుమంతరావు, డీపీఎంవో డాక్టర్ ప్రవీణ, డాక్టర్ భువనేశ్వరి, సీహెచ్‌వో రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరి, పర్యవేక్షకులు త్యాగు, ఆరోగ్య సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


లోకేష్ మృతదేహం

శ్రీరంగరాజపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎస్ఆర్‌పురం మండలం జీఎంఆర్‌పురం గ్రామ పంచాయతీ, కొండపాళ్యం ఎస్టీ కాలనీకి చెందిన జి.శివారాజు కుమారుడు లోకేష్(24) బుధవారం రాత్రి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో ఎస్ఆర్‌పురం ధర్మరాజుగుడికి వస్తుండగా, మార్గమధ్యంలో సచివాలయం వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న శ్రీరాఘవేంద్ర ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి ఉన్న ఒకే ఒక కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బోయకొండ ఆలయ ధర్మకర్త రాధమ్మకు ఎమ్మెల్యేల నివాళి


రాధమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు

బంగారుపాళ్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్త క్రిష్ణప్ప సతీమణి రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం స్వగ్రామైన బొమ్మాయిపల్లెలోని ఆర్‌కే ఫామ్ హౌస్‌లో జరిగిన దశదినకర్మకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్మోహన్, కర్నాటక రాష్ట్రానికి చెందిన మాజీ సీఎం ధర్మసింగ్ కుమారుడు అజయ్‌సింగ్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ బీకే శివరామ్, చిత్తూరు కార్పొరేటర్ వసంత్‌కుమార్, మండల టీడీపీ గౌరవ అధ్యక్షుడు జయప్రకాష్, మార్కెట్ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, జిల్లా ఈడిగ సంఘ గౌరవ అధ్యక్షుడు గోపి, పురుషోత్తం, జిల్లా ఈడిగ సాధికార సమితి గౌరవాధ్యక్షుడు బుసా నాగరాజ గౌడ్, పూతలపట్టు నియోజక వర్గ టీడీపీ మండల అధ్యక్షులు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జనార్ధన్‌గౌడ్ లు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

భారీగా ఇసుక డంపింగ్


కుశస్థలి నదిలో ఇసుక లోడుతున్న ఎక్స్‌కవేటర్, క్షీరసముద్రం సమీపంలో ఇసుక డంప్

శ్రీరంగరాజపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం క్షీరసముద్రం సమీపంలో కుశస్థలి నదినుంచి ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను గత రెండు రోజుల నుంచి తవ్వి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ స్థలంలో భారీగా డంపింగ్ చేస్తున్నారు. ఈ ఇసుకను ఎవరు ఎందుకు డంపింగ్ చేస్తున్నారో తెలియని పరిస్థితి అని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సుమన్ బుధవారం ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను, ఎక్స్‌కవేటర్‌ను గురువారం రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటింటికీ చెత్త సేకరణ సజావుగా జరగాలి

వెదురుకుప్పం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ సజావుగా జరగాలని వెదురుకుప్పం ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. బుధవారం మండలంలోని బొమ్మయ్యపల్లెలో జరుగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఐవీఆర్ఎస్ కార్యక్రమంపై ప్రజలకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. తర్వాత దేవళంపేటలో జరిగిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు క్లీనింగ్, క్లోరినేషన్ పనులను తనిఖీ చేశారు. దేవళంపేటలోని గాండ్లవీధిలో ఉన్న డ్రైనేజీ సమస్యను చూసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. కార్యదర్శి సునీత, డిజిటల్ అసిస్టెంటు విద్యాసాగర్, సచివాలయ ఉద్యోగులు ఆయన వెంట ఉన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం

పెనుమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి దళితవాడకు చెందిన దివ్యాంగుడు జగదీశ్‌కు చిత్తూరు మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఏడాది క్రితం తండ్రితో ద్విచక్ర వాహనంలో వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రికి చేయి, జగదీశ్ రెండు కాళ్లు పోగొట్టుకున్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో నాకు పింఛను ఇప్పించయ్యా అన్న శీర్షిక కథనం రావడంతో స్పందించిన ఆయన బుధవారం గొల్లపల్లిలోని జగదీశ్ ఇంటికి వచ్చి, జగదీశ్‌తో పాటు తల్లిదండ్రులకు కొత్తబట్టలతో పాటు నగదు సాయం చేశారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. టీడీపీ నాయకుడు చిరంజీవి, జనసేననేతలు శ్రీనివాసులు, మురళీ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా సుపరిపాలన

పాలసముద్రం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి వాసు నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని రంగాపురం, శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు జె.విజయ్‌కుమార్, దేవరాజులు, చిరంజీవి, హరిరాజు, వెంకటేశులు నాయుడు, తంగరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం ఏఎంసీ డైరెక్టర్‌గా గురుస్వామి



పూతలపట్టు, జూలై 30(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మార్కెట్ కమి టీ డైరెక్టర్‌గా పూతలపట్టు మండ లం పాలకూరు గ్రామానికి చెం దిన టీడీపీ సీనియర్ నేత గురుస్వామిని ప్రభుత్వం నియమించింది. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో డైరెక్టర్ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే మురళీమోహన్, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 1వ తేదీన జరుగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సర్వేయర్‌గా గణేష్

గంగాధరనెల్లూరు (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు మండల ఇన్‌చార్జి సర్వేయర్‌గా పాలసముద్రం మండల సర్వేయర్ గణేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

క్యూఆర్ కోడ్‌పై డాక్యుమెంట్ రిలీజ్

చిత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను గుర్తు చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం క్యూఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంట్ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని మంగసముద్రం, ఓబనపల్లె, తంగవేల్‌కాలనీ, మంగసముద్రం ఆటోస్టాండ్ వద్ద, తిమ్మసముద్రం వినాయకుడి గుడి వద్ద కార్యక్రమాలను నిర్వహించారు. చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, నగర అధ్యక్షులు కేపీ శ్రీధర్, నేతలు జ్ఞానజగదీశ్, మధురెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్ వితరణ

విజయపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి పుట్టినరోజును పురస్కరించుకొని తల్లిదండ్రులు చాందిని, లోకేష్‌లు విరతణగా ఫ్యాన్ అందజేశారు. గ్రామస్తులు చైర్లు, నోటుపుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. హెచ్ఎం వెంకమరాజు, ఉపాధ్యాయుడు సురేష్, జ్యోతి లక్ష్మిసురేష్, ఆనంద్, అముద, సుజాత, గంగోత్రి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

బంగారుపాళ్యం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో మహేష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై వచ్చిన అర్జీలను నెల రోజుల్లోపు అర్జీదారుడు కోరిన సమాచారం ఇవ్వాలన్నారు.

